


టెన్త్ ఇన్విజిలేటర్ల జంబ్లింగ్

సాలూరు రూరల్,మార్చి 21: పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఇన్విజిలేటర్లను జంబ్లింగ్ చేస్తున్నారు. జిల్లాలో 66 కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తుండగా వాటిల్లో 22 సీ సెంటర్లు ఉన్నాయి. కాగా ఈ పరీక్షల నిర్వహణకు తొలి విడతగా 518 మంది ఇన్విజిలేటర్లును నియమించారు. అయితే ప్రస్తుతం వారిని వెనక్కి పిలిచి.. కొత్తవారిని ఆయా కేంద్రాల్లో నియమిస్తున్నారు. ఈ నెల 23 నుంచి జరిగే సైన్స్, సోషల్ పరీక్షలను కొత్త ఇన్విజిలేటర్లతో నిర్వహించనున్నారు. గురువారం మండలాల్లో వారికి సీఎంఆర్టీలు ఆర్డర్లు పంపిణీ చేశారు. తొలి విడత ఇన్విజిలేటర్లు గణిత పరీక్ష అనంతరం వారి పాఠశాలల్లో విధులకు వెళ్లనున్నారు.

టీడీపీలోకి వలసలు

● తెలుగుదేశం పార్టీలో భారీగా వైసీపీ శ్రేణులు

● కుటుంబాలతో స్వచ్ఛందంగా చేరుతున్న పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు




పార్వతీపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా వలసలు పెరుగుతున్నాయి. అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున టీడీపీలో చేరుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వందలాది వైసీపీ కుటుంబాలు పార్టీలోకి క్యూ కడుతున్నాయి. వైసీపీ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండడంతో ఆ పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నాయి. జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాలతో పాటు 15 మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. అధికార పార్టీ ప్రముఖులు, కీలక నాయకులు .. ఇలా ఎంతోమంది టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. మరోవైపు జిల్లాలో టీడీపీ అభ్యర్థులు వివిధ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా పర్యటిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి అందరికీ తెలియజేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. దీంతో అంతటా టీడీపీకి ఆదరణ పెరుగుతోంది. ఎంతోమంది పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు టీడీపీలో చేరుతున్నారు. మొత్తంగా జిల్లాలో టీడీపీ పూర్వ వైభవం దిశగా పయనిస్తుండగా.. రానున్న ఎన్నికల్లో విజయం తథ్యమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

నియోజకవర్గాల్లో ఇలా..

● ఒకప్పుడు వైసీపీకి కంచుకోటగా ఉన్న సీతానగరం మండలం నుంచి అనేక మంది అధికార పార్టీ నేతలు ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఆ మండలం నుంచి వైసీపీకి చెందిన మాజీ జడ్పీటీసీ టి.అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ బి.శ్రీరాములు తదితరులు వారి అనుచరులతో తాజాగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నిడగల్లు తదితర గ్రామాలకు చెందిన అనేక మంది అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు.

● పార్వతీపురం పట్టణం, బలిజిపేట మండలంలో కూడా అధికార పార్టీ నుంచి అనేకమంది టీడీపీలో చేరారు. రానున్న రోజుల్లో సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మండలాల తోపాటు పార్వతీపురం పట్టణం నుంచి కూడా మరికొంతమంది వైసీపీకి చెందిన ప్రముఖులు తెలుగుదేశం పార్టీలో చేరే అవకాశం ఉందని సమాచారం.

● బొబ్బిలి టీడీపీ అభ్యర్థి బేబీనాయన సీతానగరం, బలిజిపేట మండలాల్లో మంచి పట్టు ఉంది. దీంతో ఆయా మండలాల నుంచి పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారు. మరోవైపు ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవి తదితరులు ప్రత్యేక శ్రద్ధతో పార్వతీపురం అభ్యర్థి బోనెల విజయ చంద్ర విజయం కోసం కృషి చేస్తున్నారు.

● కురుపాం టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరికి నియోజకవర్గంలో ఆదరణ బాగా పెరిగింది. నిజమైన ఆదివాసీ బిడ్డగా, రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన మహిళగా గిరిజనులతో పాటు గిరిజనేతరులు గుర్తించి టీడీపీలో చేరుతున్నారు. భారీ మెజార్టీతో జగదీశ్వరిని గెలిపిస్తామని వారు చెబుతున్నారు. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టీడీపీ రాష్ట్ర నాయకులు వీరేష్‌చంద్రదేవ్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు డి.రామకృష్ణ, మధుసూదనరావు, డి.వెంకటనాయుడు, సుధ, మాజీ జడ్పీటీసీ కొండయ్య, మాజీ ఎంపీపీ సురేష్ లాంటి సీనియర్ నాయకులు పక్కా ప్రణాళికతో ఆమె విజయం కోసం కృషి చేస్తున్నారు.

● గతంలో ఎమ్మెల్సీగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా వ్యవహరించిన సాలూరు టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి కూడా గిరిశిఖర, మైదాన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇదే సమయంలో ఆమె ఆధ్వర్యంలో మక్కువ తదితర ప్రాంతాల నుంచి ఎంతోమంది అధికార పార్టీ నేతలు టీడీపీలో చేరుతున్నారు. ఈ నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలంతా ఐక్యతతో ముందుకు సాగుతున్నారు. సంధ్యారాణి విజయం కోసం మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, జనసేన పార్టీ, బీజేపీ శ్రేణులు కూడా తీవ్రంగా కృషి చేస్తున్నారు.

● పాలకొండ నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు అభ్యర్థి ఎవరనేది ఖరారు కాలేదు. ఈ నియోజకవర్గంలో టీడీపీకి బలమైన క్యాడర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న నిమ్మక జయకృష టీడీపీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఎంతోమంది గిరిజనులు, వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఒకట్రెండు రోజుల్లో టీడీపీ అధిష్టానం స్పష్టత ఇవ్వనుంది.

సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై చర్యలు

● ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయండి: కలెక్టర్

పార్వతీపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీ-విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులతో మాట్లాడారు. కోడ్ ఉల్లంఘనకు సంబంధించి సీ-విజిల్ యాప్‌లో నమోదయ్యే ఫిర్యాదులపై వంద నిమిషాల్లో అధికారులు స్పందించాలన్నారు. తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారునికి తెలియజేయాలన్నారు. ఆ యాప్‌లో నమోదైన ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కంట్రోల్ రూంలు నిరంతరం పనిచేయాలని, రాత్రి సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లడానికి తనిఖీ బృందాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పెండింగ్ ఫారాలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల సామగ్రి తరలింపు, స్ట్రాంగ్ రూం, రవాణా, భద్రత పంపిణీ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పీవోలు కల్పనాకుమారి, విష్ణుచరణ్, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర అధికారులతో సమన్వయ సమావేశం

ప్రశాంత ఎన్నికల కోసం కలెక్టరేట్‌లో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం, రాయగడ, కోరాపుట్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రత్యేకించి మద్యం, మాదక ద్రవ్యాలు, ఉచితాల పంపిణీ నియంత్రించడం, జిల్లాల సరిహద్దుల్లో పోలింగ్ సిబ్బంది వెళ్లడం, వాహనాలు సమకూర్చడం వంటి వాటిపై సమన్వయంతో వ్యవహరించాలని నిర్ణయించారు. కొఠియా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ, సరిహద్దుల గుండా మద్యం రవాణా, రైల్వే, బస్సు, ప్రైవేట్ వాహనాల్లో గంజాయి తరలింపు , ఇరువైపులా సరిహద్దు చెక్‌పోస్టులపై నిఘా పటిష్ఠం చేయాలని నిర్ణయించారు. కొఠియాలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ కోరారు. ఓటు వేయకుండా అడ్డుకోకూడదన్నారు. 22 గ్రామాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ జాబితాను కోరాపుట్ జిల్లాకు పంపుతామని కలెక్టర్ తెలిపారు. కాగా ఇందుకు సహకరించేందుకు కోరాపుట్ జిల్లా యంత్రాంగం అంగీకరించింది.



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

చదువులో వెనుకబడుతున్నాడని..

● ఓ విద్యార్థి ఆత్మహత్య

● ఒక్కగానొక్క కుమారుడి మరణాన్ని తట్టుకోలేకపోతున్న తల్లిదండ్రులు

పార్వతీపురం టౌన్, మార్చి 21: చదువులో వెనుకబడుతున్నాడని మన స్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు బాగా చదువుకొని తమ కుటుంబాన్ని ఆదుకుంటాడని అనుకుంటే.. ఇంతలోనే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడని వారు కన్నీరుమున్నీరవుతున్నారు. పట్టణంలో కుసుమగుడ్డి వీధికి చెందిన ఓ విద్యార్థి ఒత్తిడి తట్టుకోలేక బుధవారం ఉసురు తీసుకోగా.. ఒక రోజు వ్యవధిలో మరో విద్యార్థి ఇలా మరణించడం స్థానికంగా కలకలం రేపింది. తాజా ఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బోటువారి వీధికి చెందిన శ్రేయష్(17) పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. విద్యార్థి తండ్రి నాడెం ఈశ్వరరావు కూలి పనులకు వెళ్తుండగా, తల్లి జగదీశ్వరీ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడిని బాగా చదివించాలనుకున్నారు. ఈ మేరకు ఇంటర్ (ఎంపీసీ) కోసం ఓ కళాశాలలో చేర్పించారు. కాగా ఇటీవల ఆ విద్యార్థి మొదటి ఏడాది పరీక్షలు రాశాడు. అయితే చదువులో వెనుకబడుతున్నానని కొన్ని రోజులుగా తోటి విద్యార్థులకు చెప్పి బాధపడుతుండేవాడు. మరోవైపు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తానో.. లేదో నన్న భయం శ్రేయష్‌ను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. ఇంటిలో విగతజీవిగా పడి ఉన్న శ్రేయష్‌ను చూసి షాక్‌కు గురయ్యారు. కుమారుడి మరణాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక తాము ఎవరికోసం బతకాలంటూ వారు రోదించగా.. స్థానికుల సైతం కంటతడి పెట్టుకున్నారు. దీనిపై పట్టణ ఎస్ఐ పి.సంతోషికుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శ్రేయష్

కోడ్ కూసినా.. తొలగించరా?

● విద్యుత్ మీటర్లపై సీఎం చిత్రం

● సర్వేరాళ్ల సంగతేంటో..!



కొమరాడ, మార్చి 21 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి రోజులు గడుస్తున్నా.. ఇంకా పల్లెల్లో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఎక్కడికక్కడ సీఎం జగన్ చిత్రాలు, పేర్లు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ పథకం కింద వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించారు. మరికొన్ని ప్రాంతాల్లో బిగిస్తున్నట్లు సమాచారం. అయితే సీఎం జగన్ చిత్రాలతో కూడిన స్టిక్కర్లతో పాటు వైఎస్ఆర్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం పేరుతో మీటరు బాక్సులు దర్శనమిస్తున్నాయి. కొమరాడ మండలంలో పలు చోట్ల పంట పొలాల్లో ఇటువంటి మీటర్లు కనిపిస్తున్నాయి. ఇక పొలాల సరిహద్దులోని సర్వే రాళ్లపై కూడా సీఎం పేరు దర్శనమిస్తోంది. గుణానపురం సచివాలయం పరిధిలోని కూతవేటు దూరంలో ఇవి కనిపిస్తున్నా.. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కొమరాడ వెలుగు కార్యాలయ భవన శిలాఫల కంపై ఉన్న నేతల పేర్లు కనిపిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం 48 గంటల్లో వాటికి ముసుగులు వేయాలి లేదా తొలగించాలి. కానీ జిల్లాలో అనేక చోట్ల సర్వే రాళ్లు, విద్యుత్ మీటర్లు, తదితర వాటిపై సీఎం జగన్ చిత్రాలు, పేర్లు నేటికీ దర్శనమిస్తున్నాయి. తక్షణమే వాటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కొమరాడ మండల టీడీపీ కన్వీనర్ శేఖరపాత్రుడు తదితరులు డిమాండ్ చేస్తున్నారు.




పాంచాళిలో వైసీపీ కార్యకలాపాల్లో పాల్గొన్న వలంటీర్లు

వలంటీర్లపై వేటు

● కోడ్ ఉల్లంఘించిన 11 మంది తొలగింపు

పార్వతీపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి)/పాచిపెంట: ఎన్నికల కోడ్ అడ్డుగా ఉన్నా.. హద్దుమీరిన వలంటీర్లపై అధికారులు కొరడా ఝుళిపించారు. అత్యుత్సాహంతో అధికార పార్టీ ప్రచారంలో పాల్గొన్న 11 మందిపై వేటు వేశారు. వివరాల్లోకి వెళ్తే.. పాచిపెంట మండలం పాంచాళి గ్రామంలో ఈ నెల 19న వైసీపీ కార్యకలాపాల్లో వలంటీర్లు పాల్గొన్నారు. దీనిపై ఎంపీడీవో లక్ష్మీకాంత్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన వాట్సాప్ నెంబరుకు ఫొటోలు కూడా పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన ఎంపీడీవో నివేదికను రూపొందించి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు పంపించారు. ఆ తర్వాత వలంటీర్లను సంజాయిషీ కోరుతూ విచారించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు తేలడంతో పీవో ఆదేశాల మేరకు పదకొండు మంది వలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీవో గురువారం ఆదేశాలు జారీ చేశారు.

● సస్పెన్షన్‌కు గురైంది వీరే..

వలంటీర్లు అయిన మహిసర్ల నాగమణి (సి-5), అంజలి నాగరాజు (సి-6), కోరుకొండ అనసూయమ్మ (సి-7), కొండగొర్రె వీరబాబు(సి-9), సర్లింగి మాధవ (సి-10), పారాధి ధనుంజయ్ (సి-11), పతేడ ఈశ్వరరావు(సి-13), ముడారపు మహేష్ (సి-15), కంది శంకరరావు (సి-16), జవ్వాది సత్యనారాయణ (సి-17), పతేడ సింహాచలం (సి-18) సస్పెండ్ అయ్యారు.

ఎంఎన్‌వో సస్పెన్షన్

పార్వతీపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కురుపాం సీహెచ్‌సీలో ఎంఎన్‌వోగా పనిచేస్తున్న సీహెచ్ కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఈనెల 27న ఇడుపులపాయ నుంచి ప్రారంభమవనున్న వైసీపీ బస్సు యాత్రకు మేమంతా సిద్ధం' అని ఆయన పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసినందుకు గాను ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమాళి ఉల్లంఘన, ఉద్యోగి ప్రవర్తనా నిబంధనలు 1964లోని 19(1)(ఏ) మేరకు సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు.

ప్రతీ వాహనాన్ని పరిశీలించండి: డీఎస్పీ

పాలకొండ: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని నిశితంగా పరిశీలించాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆదేశించారు. గురువారం పాలకొండలోని గాయత్రీదేవి ఆలయ సమీపంలో ఒకటి, గొట్టమంగళాపురం జంక్షన్ వద్ద మరొక చెక్‌పోస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రెండు చెక్‌పోస్టుల్లో సిబ్బంది శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించి వాహన తనిఖీలు చేపడతారన్నారు. డబ్బు రవాణా, ఇతర మాదక ద్రవ్యాలపై నిఘా పెట్టామని ఆయన తెలిపారు. అనంతరం గొట్టమంగళాపురం చెక్‌పోస్టు వద్ద కార్లు, పలు వాహనాలను తనిఖీ చేసి పరిశీలించారు. ఆయన వెంట సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, ప్రత్యేక బలగాలు, సిబ్బంది ఉన్నారు.



పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఎస్పీ ఆరా

సీతానగరం, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ బలిజిపేట మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. తొలుత బలిజిపేట, పెదపెంకి, బర్లి, వంతరాం, చిలకలపల్లి, గంగాడ, నారం నాయుడు వలస, గలావల్లి తదితర గ్రామాల్లోని సాధారణ, సమస్యాత్మక , అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మౌలిక వసతులు, భద్రత ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి తగు సూచనలు, సలహాలు అందించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదని సూచించారు. ఆయన వెంట పార్వతీపురం రూరల్ సీఐ కె.రవికుమార్, బలిజిపేట ఎస్ఐ వి.పాపారావు తదితరులు ఉన్నారు.



నిబంధనలు ఇవీ.. పాటించాల్సిందే మరి..!

● ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు


● కొనసాగుతున్న అధికారుల నిఘా

(కొమరాడ)

సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన వెంటనే కోడ్ అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే.. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఓట్ల లెక్కింపు వరకు పాటించాల్సి ఉంది. లేకుంటే ఇబ్బందులు తప్పవు. ఇప్పటికే అధికార యంత్రాంగం రాజకీయ పార్టీ నేతల కదలికలు, ప్రచార శైలిని ఓ కంట కనిపెడుతోంది. ప్రభుత్వ పథకాల పోస్టర్లు, హోర్డింగ్‌లు తొలగిస్తున్నారు. విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ శాఖాధికారులు పలుచోట్ల చెక్‌పోస్టులు కూడా ఏర్పాటు చేశారు. విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. నగదు, బంగారు ఆభరణాలకు సరైన ఆధారాలు, పత్రాలు లేకుంటే స్వాధీనం చేసుకుంటున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. మరోవైపు అధికారులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలపై కూడా నిఘా పెట్టారు. ఇందుకోసం ఓ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీల నేతలు పాటించాల్సిన నిబంధనలను ఇప్పుడు తెలుసుకుందాం.



సామాజిక మాధ్యమాలపై..



ఎన్నికల సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారంపై మీడియా మానిటరింగ్ కమిటీ దృష్టి సారిస్తుంది. కలెక్టర్, పోలీస్ అధికారులు, సీనియర్ రిపోర్టర్, పౌర సంబంధాల అధికారి, సీనియర్ సిటిజన్ సభ్యులతో మీడియా మానిటరింగ్ కమిటీని ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచార కార్యక్ర మాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. అవాంఛనీయ అంశాలను ప్రచారం చేసిన సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటుంది.

వీటికి అనుమతులు తప్పనిసరి

● రాజకీయ పార్టీలు ప్రచార ప్రకటనలు, లౌడ్ స్పీకర్లను వినియోగించేందుకు ప్రత్యేకంగా అధికారుల అనుమతులు తీసుకోవాలి.

● అభ్యర్థి ప్రచారానికి మూడు వాహనాలను మాత్రమే వినియోగించాలి. వీటికి సైతం ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి. ● ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి రాత్రి, పగలు తేడా లేకుండా ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చు. ● ప్రైవేటు స్థలాల్లో ప్రచారానికి యజమాని అనుమతి తప్పనిసరి. ● ప్రచార ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు అందజేయాలి. ● ర్యాలీలు, ప్రచారం, సభలు, సమావేశాలను నిర్ధేశిత సమయంలోగా ముగించాలి.

ఎనిమిది అంశాలపై దృష్టి

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు సమయంలో ఈ విషయాలపై ప్రత్యేక నిఘా ఉంటుంది. ● కేంద్రం, రాష్ట్రం అధికారంలో ఉన్న పార్టీలు ప్రచారంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించకూడదు. ● అధికార పార్టీలు పథకాలు, ప్రాజెక్టులు, విధానాలను ప్రకటించకూడదు.

● ప్రభుత్వ ఖర్చులతో పత్రికలు, మీడియా, ఇతర మాధ్యమాల్లో ప్రకటనలపై నిషేధం ఉంటుంది.● మంత్రులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు అధికారిక కార్యక్రమాల పేరిట ప్రచారం చేయకూడదు. ప్రభుత్వ వాహనాలు వినియోగించరాదు. ● బహిరంగ సభల నిర్వహణకు మైదానాలు, హెలీప్యాడ్‌ల వినియోగంలో అధికార పార్టీతో అన్ని పార్టీలకు ఒకే నిబంధన వర్తిస్తుంది. ● ప్రభుత్వాలు ఎలాంటి తాత్కాలిక నియామకాలు చేపట్టకూడదు. ● ఎన్నికల ప్రచారానికి వేదికలుగా దేవాలయాలు, మండపాలు, చర్చిలు, మసీదులు, మందిరాలు ఉపయోగించకూడదు. ● ఎన్నికలకు 48 గంటల ముందు ఎలాంటి ప్రచారం చేయకూడదు.

రాష్ట్రాభివృద్ధి కోసం కూటమిని గెలిపించండి

బొబ్బిలి, మార్చి 21: రాష్ట్రాభివృద్ధికి కూటమి గెలుపు తప్పనిసరి అని బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఏడోవార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు-స్వప్న దంపతుల ఆధ్వర్యంలో ఇంటింటికీ బేబీనాయన వెళ్లి ఓటర్లను కలుసుకొని టీడీపీ కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డులో ఆయనకు ఘనస్వాగతం లభించింది. మహిళలు హారతులు ఇచ్చి, నుదుట కుంకుమదిద్ది ఆశీర్వదించారు. ఈ ప్రచారంలో బేబీనాయన వెంట జనసేన నేతలు పాలూరు బాబు, సంచాన గంగాధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సజ్జా వెంకటరావు, తెలుగు మహిళా నాయకురాళ్లు బర్తి శ్రీదేవి, వెలగాడ షైమావతి, బీసపు పార్వతి, కళ్యంపూడి లక్ష్మీసత్యనారాయణ, సుంకరి సాయిరమేష్, బొద్దాన అప్పారావు, పర్తాపు చంద్రశేఖర్, కేతిరెడ్డి చంద్రశేఖర్, సాలా రమేష్, తెర్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురువారం ఓ రజకుని ఇంటి వద్ద బట్టలు ఇస్త్రీ చేసి అందరినీ ఆకట్టుకున్నారు.



ప్రచారం చేస్తున్న ప్రసాదుల ప్రసాద్

సూపర్ సిక్స్ పథకాలను వివరించాలి

విజయనగరం రూరల్: రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ అర్బన్ అధ్యక్షుడు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు తరుఫున నగరంలోని నాలుగో డివిజన్‌లో గురువారం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకువెళ్లే సమర్థ నాయకుడు చంద్రబాబేనన్నారు. టీడీపీ నా యకులు రఘుమండ శంకరరావు, ఖండవిల్లి బాబీ, జన్యాల వెంకటరావు, కర్రి రాము తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న బేబీనాయన

విజయనగరంలో 'జయహో ఎస్సీ'

విజయనగరం రూరల్: నగరంలోని 47వ డివిజన్ పరిధిలోని కాంబోయి వీధిలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు 'జయహో ఎస్సీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న అదితి గజపతిరాజుని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం టీడీపీ హయాంలో జరిగిన కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాన్ని మామిడి రవిశంకర్, కందువా ప్రకాష్, షైలిపల్లి పైడిరాజు ఆవిష్కరించారు.



పోస్టర్లు ప్రదర్శిస్తున్న టీడీపీ ఎస్సీసెల్ నాయకులు



బొండపల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్



ఎంపీటీసీ చిరంజీవికి టీడీపీ కండువా వేస్తున్న కోండ్రు

ఐక్యతతో విజయం సాధిద్దాం

● జిల్లా వ్యాప్తంగా టీడీపీలోకి పలువురు చేరిక

బొండపల్లి (గజపతినగరం): గంగ చోళ్లపెంట గ్రామంలో గురువారం టీడీపీ గజపతినగరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు అట్టాడ లక్ష్మంనాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొని, మాట్లాడారు. ఐక్యతతో విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. కొనిస గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మడక కన్నబాబు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన సుమారు వంద కుటుంబాలు శ్రీనివాస్ సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ సభ్యులు వేపాడ చిరంజీవులు, జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, గజపతినగరం నియోజకవర్గ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు, టీడీపీ సమన్వయకర్త సురేంద్ర, పార్టీ మండల అధ్యక్షులు, పార్టీ గ్రామ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, స్థానిక పంచాయతీల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని అంతికాపల్లి, ఒమ్మి రేగిడి మండలం రెడ్డిపేట గ్రామాలకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్, అంతికాపల్లి మాజీ ఎంపీటీసీ సామంతుల చిరంజీవి.. వారికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ వైసీపీ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. టీడీపీలో చేరిన వారిలో అలజింగి దయా, పాండ్రంకి నరేష్, నాగేశ్వరరావు, వెంకట్ విశ్వనాథం, అప్పారావు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, కిమిడి అశోక్‌కుమార్, నాయకులు గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, వంగా వెంకటరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, మజ్జి శ్రీను, వావిలపల్లి క్రాంతి, నాగళ్ళ అప్పలనాయుడు, కెల్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

● బొబ్బిలి: బొబ్బిలి మండలం కారాడ గ్రామ సర్పంచ్ తెర్లి శేఖర్‌తో పాటు గ్రామానికి చెందిన సుమారు 25 కుటుంబాల వారు గురువారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన సమక్షంలో వారంతా పార్టీలో చేరడంతో కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్లు ఊద పార్వతి, యడ్ల గంగులు, యందవ చిన్నప్పమ్మ, ఇట్రంజి రామలక్ష్మి, కొర్లాపు లక్ష్మి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా తొలుత గ్రామస్థులు బేబీనాయనను చాలా కోలాహలంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బేబీనాయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి గాలి వీస్తోందన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ కూడా కూటమికి మద్దతు పలకడం ఎంతో శుభపరిణామమన్నారు. టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

జన్నివలసలో 'బాబు ష్యూరిటీ..'

తెర్లాం: మండలంలో జన్నివలసలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బోడెల సింహాచలం అధ్యక్షతన ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చేశారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని వారు అన్నారు. జగన్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. అందుచేత ఇక్కడ మన ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయనకు అందరూ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మరడాన రమేష్, కర్రి సత్యనారాయణ, వెంకటరావు, కర్రి సత్యం, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

రాజాం: నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి తన గెలుపునకు తోడ్పాటును అందించాలని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. గురువారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీకి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, సమల వెంకట మన్మథరావు, గురవాన నారాయణరావు, కిమిడి అశోక్‌కుమార్, పిన్నింటి మోహన్‌రావు, దూబ ధర్మారావు, నాగళ్ల అప్పలనాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

రామభద్రపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో అనుభవం కలిగిన చంద్రబాబునాయుడు సేవలు రాష్ట్రానికి అవసరమని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపొందడం చారిత్రక అవసరమని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల జీవితాలను నాశనం చేశారని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలంతా విజ్ఞతతో తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

ఉల్లంఘిస్తే చర్యలు

లక్కవరపుకోట, మార్చి 21: ఎన్నికల కోడ్ ఉల్లంగించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. బీఎల్‌వోలంతా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అదే విధంగా మేజర్ పంచాయతీ ఈవో ప్రసాద్ గురువారం వాలంటీర్లను పిలిపించి ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. ఏ ఒక్క వాలంటీరు ఎన్నికల ర్యాలీల్లోగానీ, సభలు, సమావేశాల్లో గానీ పాల్గొనరాదని తెలిపారు. గీత దాటితే వేటు తప్పదని హెచ్చరించారు. అదే విధంగా ఏపీఎం అప్పలనాయుడు తమ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియపై చర్చించారు. గ్రామాల్లో మహిళలతో, గ్రూపు సభ్యులతో సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలన్నారు.

నిబంధనలు పాటించండి



సిబ్బందితో సమీక్షిస్తున్న ఆంజనేయులు

బాడంగి, మార్చి 21: గ్రామాల్లో విధిగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేయాలని మండల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ లీడర్ ఆంజనేయులు అన్నారు. గురువారం రేజేరు, వాడాడ, కోటిపల్లి, గూడెపువలస సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, మహిళా పోలీసులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఇళ్లపై ఉంటే తక్షణమే తొలగించాలని, ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా పనిచేస్తే చర్యలకు వెనుకాడేది లేదన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో బాలభాస్కరరావు అన్నారు. జాకేరు, కరకవలస, చాలమలాపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ఎండీఎంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కరకవలస పాఠశాలలో నిర్మాణంలో ఉన్న టాయిలెట్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంట సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈవో

వైభవంగా మహాసామ్రాజ్య పట్టాభిషేకం

విజయనగరం (ఆంధ్రజ్యోతి) మార్చి 21: నగరంలోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకారులు పరమహంస పరివ్రాజకులు, అహోబిల రామానుజ చినజీయర్ స్వామి (హైదరాబాద్) వారిచే రామాయణ అనుగ్రహం అనే కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రామాయణంలోని మహాసామ్రాజ్య పట్టాభిషేకం ఘట్టాన్ని ఆయన భక్తులకు వివరించారు. ప్రవచనాలను భక్తుల కళ్లకు కట్టినట్లు వివరించారు.





హాజరైన భక్తులు, మాట్లాడుతున్న అహోబిల చినజీయర్ స్వామి

మహిళా సంఘాలతో సమావేశం

విజయనగరం రూరల్: నగరంలోని 30, 31 డివిజన్లలో టీడీపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మహిళా విభాగం నాయకులు పత్తిగిల్లి సూర్యకుమారి, అనురాధ బేగం తదితరులు టీడీపీ హయాంలో మహిళా సంక్షేమం, డ్వాక్రా గ్రూప్‌ల అభివృద్ధి తదితర విషయాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోగుల రమేష్, బెవర భరత్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన డ్వాక్రా గ్రూప్ మహిళా సభ్యులతో మాట్లాడుతున్న అనురాధా భేగం

అదితికి మద్దతుగా ప్రచారం

విజయనగరం రూరల్: టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు గురువారం బాబామెట్టలోని 3, 4, 5 లైన్లలోని బ్రాహ్మణులను కలిసి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజును సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయంలో సామగ్రి వేలం

విజయనగరం రూరల్: పైడితల్లమ్మ ఆలయానికి సంబంధించి చదురు, వనం గుడిలో కొబ్బరి ముక్కలు, చీరలు, జాకెట్లు, తలనీలాలు, అదే విధంగా పైడిమాంబ దత్తత ఆలయమైన వేంకటేశ్వరామి ఆలయంలో కొబ్బరి ముక్కలు, ఇతరత్ర సామగ్రికి గురువారం వేలం పాట నిర్వహించారు. 2024 మార్చి నుంచి 2025 మధ్య కాలానికి సంబంధించి స్థానిక శివాలయంవీధిలో ఉన్న పైడితల్లమ్మ కల్యాణ మండపంలో ఈ కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, దేవదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వేలం పాటలో అధికారులు, వేలం కాంట్రాక్టర్లు

24న శిష్టకరణాల వివాహ పరిచయ వేదిక

దాసన్నపేట: నగరంలోని గుంటురువారి వీధిలోని బృందావన్ అపార్టుమెంట్‌లో ఈ నెల 24న జిల్లా శిష్టకరణాల సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.పీ గౌరీశ్వరావు, నగర శాఖ అధ్యక్షుడు కె.ఎం సంజీవరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీక వన సమారాధన కార్యక్రమంలో సేకరించిన వధూవరుల వివరాల పుస్తకాన్ని ఈ పరిచయ వేదిక కార్యక్రమంలో అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని పట్టణ, మండలాలు, గ్రామాల్లో ఉన్న శిష్టకరణాల కుటుంబసభ్యులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగించాలి

బొబ్బిలి: పట్టణంలో గల ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను, మురుగును తక్షణం తొలగించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి శానిటరీ అధికారులను ఆదేశించారు. గురువారం నాయుడు కాలనీ, మిలటరీ కాలనీ, ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతాలలో ఆమె పర్యటించారు. నాయుడు కాలనీలో కల్వర్టుల సమస్య ఉందని, ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేయించాలని న్యాయవాది పోల అరుణ్ కుమార్ ఆమె దృష్టికి తీసుకొచ్చారు. నిధుల లభ్యతను బట్టి కల్వర్టులను మంజూరు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

యూటీఎఫ్ ఆధ్వర్యంలో నివాళులు

జామి: మండల కేంద్రమైన జామిలో యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతి, మాజీ రాష్ట్ర కార్యదర్శి శేషగిరి జయంతి లను మండల శాఖ నిర్వహించింది. వారికి నివాళులు అర్పించింది. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఈశ్వరరావు, రాజారావు, కొల్లి సూర్యనారాయణ, జి.ప్రసాద్, జనార్దన్, ముత్యాలు, రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సభలకు అనుమతి తప్పనిసరి

రామభద్రపురం: గ్రామాల్లో రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులు, సచివాలయ డీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అనుమతులు లేకుండా ఎటువంటి ర్యాలీలు, సభలు చేయకూడదని అన్నారు. ఇళ్లపై జెండాలు ఉండకూడదని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఆకుల సులోచనారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

సింగిల్ విండోలో 19 రకాల అనుమతులు

● ఆర్డీవో సాయిశ్రీ

బొబ్బిలి: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని బొబ్బిలి ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి ఆదిమూలం సాయిశ్రీ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సింగిల్ విండో పద్ధతిలో 19 రకాల అనుమతులను మంజూరు చేస్తామన్నారు. ఇంటింటి ప్రచారం చేయాలనుకున్నా అనుమతి తప్పనిసరి అన్నారు. సువిధ యాప్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు దరఖాస్తు చేసుకుంటే అన్ని శాఖల నోడల్ అధికారులు అనుమతి ఇస్తారని ఆమె తెలిపారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలకు సంబంధించి ఏదైనా సమాచారం లేదా ఫిర్యాదులు కంట్రోలు రూము నెంబర్ 08944 255888కు తెలియజేయాలన్నారు. మద్యం, డబ్బు, కానుకల పంపిణీని అడ్డుకుంటామన్నారు. వచ్చే నెల 15 వరకు కొత్తగా ఓటర్ల పేర్లను చేర్చుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. దీనిని అందరూ వినియోగించుకోవాలని ఆర్డీఓ సాయిశ్రీ సూచించారు.

బొబ్బిలి: స్థానిక తహ సీల్దారు కార్యాలయంలో గురువారం సాయంత్రం సెక్టారు అధికారులు, పోలీసు అధికారులతో ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్‌ల స్థితిగతులు, సమస్యాత్మక ప్రాంతాలు, తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటిపై ఆమె సమీక్షించారు. అంతకుముందు ఉదయం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, డిప్యూటీ తహశీల్దారు రెడ్డి సాయికృష్ణ, టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ప్రతినిధులు గంటి గోపాలకృష్ణశర్మ, పక్కి చంద్రమౌళి, ముప్పల శ్రీనివాసరావు, సెక్టారు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

బొబ్బిలి: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు (ఆర్‌పీఎస్ఎఫ్), సివిల్ పోలీసులు సంయుక్తంగా బొబ్బిలిలో కవాతు నిర్వహించారు.

జామి: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఐ హెచ్ ఉపేంద్ర ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. గురువారం జామి, జాగరం, చింతాడ, పావాడలో కవాతు సాగింది. అనంతరం సీఐ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సాయుధబలగాల సంఖ్య ఎన్నికల సంఘం పెంచడంతోపాటు వారికి వెపన్స్ ఇచ్చిందని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరు విఘాతం కల్పించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కవాతులో ఎస్ఐ వీరబాబు తదితరులు ఉన్నారు.



బొబ్బిలి నాయుడుకాలనీలో..

తెర్లాం: మండల పరిధిలో ఉద్దవోలులో సీఐ తిరుమల రావు, ఎస్.ఐ రమేష్ అధ్యక్షతన ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో అందరూ ప్రశాంతంగా ఓటు వేయాలని, సమస్యాత్మక వ్యక్తు లు ఎవరైనా ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రసాద్, దాసు, సిబ్బంది పాల్గొన్నారు.



జామి మండలం చింతాడలో..

నీళ్ల ట్యాంకులో పడి బాలుడి మృతి

భోగాపురం, మార్చి 21: నీళ్ల ట్యాంకులో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. బొబ్బిలి కొత్తఎరుకుల వీధికి చెందిన దాసరి సుధా, దాసరి నరిశింగరావు దంపతులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి శిరీషా, సిద్ధూ(7) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరంతా కూలి పనుల నిమిత్తం ఈనెల 18న దిబ్బలపాలెంలోని ఓ రిసార్ట్స్‌లో చేరారు. వీరికి నిర్వాహకులు రిసార్ట్స్ ఆవరణలోనే నివాసం ఉండేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే గురువారం ఉదయం దంపతులిద్దరూ పనులకు వెళ్లిపోవడంతో పిల్లలిద్దరూ తోటి పిల్లలతో కలిసి రిసార్ట్ ఆవరణలోనే ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో వీరి కుమారుడు దాసరి సిద్ధూ సమీపంలో వాడుక కోసం ఏర్పాటు చేసిన నీళ్ల ట్యాంకులో పడిపోయాడు. దీంతో తోటి చిన్నారులు కేకలు వేశారు. వెంటనే కుటుంబ సభ్యులు, సెక్యూరిటీ గార్డు వచ్చి బాలుడిని ట్యాంకులో నుంచి బయటకి తీసి హుటాహుటీన స్థానిక సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై బాలుడు తండ్రి నరిసింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

● అవయవ దానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు

భామిని: మండలంలోని బురుజోల గ్రామానికి చెందిన ఊయక మణికంఠ (24) బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందడంతో అవయవదానానికి కుటుంబసభ్యులు ముందుకొచ్చారు. కుటుంబ సభ్యులు, కొత్తూరు పోలీసుల కథనం మేరకు... కొత్తూరు మండలం మాసంగి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మణికంఠ గాయపడ్డాడు. తలకు తీవ్రగాయాలుకావడంతో బ్రెయిన్ పని చేయక మృతిచెందాడు. మణికంఠ శరీర భాగాలు ఉపయోగపడతాయని జెమ్స్ ఆసుపత్రి వైద్యాధికారులు కుటుంబ సభ్యులకు సూచించారు. డాక్టర్ల సూచనల మేరకు కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు.దీంతో ఏ అవయవాలు పనికొచ్చినా తీస్తామని వారి వద్ద నుంచి అంగీకారపత్రం తీసుకున్నారు. ఊపిరితిత్తులు, కళ్లు సేకరించారు. ఊపిరితిత్తులు హైదరాబాద్‌కు పంపించగా, కళ్లు రెడ్‌క్రాస్ తరలించారు. మణికంఠకు అన్న, వదినతో పాటు అక్కలు గిరిజ, ఉమ, బావలు ఫల్గుణరావు, చందు ఉన్నారు. అవయవదానం చేయడంతో మణికంఠ సజీవంగానే ఉన్నట్లు అయిందని పలువురు కుటుంబ సభ్యులను అభినందిస్తున్నారు. అవయవదానంపై జెమ్స్ వైద్యులు ధ్రువపత్రాలు అందజేస్తారని, దీంతో వైద్యపరంగా ఎటువంటి సహకారమైనా దొరుకుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తూరు పరిధిలో ప్రమాదం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. గురువారం మణికంఠ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యం సీసాల స్వాధీనం

రేగిడి: ఉంగరాడమెట్ట సెంటర్ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న అంబఖండి గ్రామానికి ఒక వ్యక్తిని పట్టుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నిందితుడి వద్ద నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

బంగారం షాపులపై దుష్ప్రచారం తగదు

● బొబ్బిలి గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్

బొబ్బిలి, మార్చి 21: బొబ్బిలి పట్టణంలో గల బంగారం షాపులపై ఎటువంటి ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేయడం తగదని బొబ్బిలి గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్-స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు అన్నారు. గురువారం సాయంత్రం సంఘనాయకులు పూసర్ల శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ప్రతి బంగారు ఆభరణం హెచ్‌యూఐడీ హాల్‌మార్కింగ్‌తో అమ్మకాలు చేస్తున్నామన్నారు. బీఐఎస్ అప్రూవ్ చేసిన కేంద్రాలు ఓ కోడ్‌ను ముద్రిస్తాయని, ఆ కోడ్‌ను మొబైల్‌లోని బీఐఎస్ కేర్ యాప్‌లో ఎంటర్ చేస్తే ఆ నగలు ఎప్పుడు కొనుగోలు చేశారు? దాని నాణ్యత, షాపు వివరాలు వస్తాయన్నారు. ఈ నూతన విధానంలో అత్యంత పారదర్శకత ఉంటుందన్నారు. వీటిపై సోషల్ మీడియాలో ఇతర మాధ్యమాల్లో ఆధారాలు లేని వార్తలు ప్రచురించవద్దని, వినియోగదారుల్లో అనుమానాలు రేకెత్తించవద్దని హితవు పలికారు.

సీతారాములకు బేబీనాయన పూజలు

తెర్లాం: నందిగాంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బేబీనాయన హాజరయ్యారు. సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న బేబీనాయన

గంగన్నపాడులో పరామర్శ

ఇటీవల గంగన్నపాడు మాజీ సర్పంచ్ గేదెల అచ్యుతరావు మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను గురువారం బేబీనాయన పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకట నాయుడు, నాయకులు కరణం రమేష్, పోలి నాయుడు, జావాన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

లక్కవరపుకోట (కొత్తవలస), మార్చి 21: మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో గల తుమ్మికాపల్లి పంచాయతీ శివారు సీతంపేటలో గురువారం వైద్య సిబ్బంది క్షయ వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ సత్యారావు ర్యాలీ చేపట్టారు. రెండు వారాలపాటుదగ్గు, జ్వరం, కఫం, ఆకలి మందగించి నీరసంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని హెల్త్ సూపర్‌వైజర్ ఎం.ఈశ్వరరావు తెలిపారు. వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీబీ నివారణ మనందరి బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ, కొత్తవలస టీబీ యూనిట్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సీతంపేటలో క్షయవ్యాధిపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సీఏఏ అమలును అడ్డుకోవాలి

● వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీల నాయకుల పిలుపు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోహనరావు

పార్వతీపురం టౌన్:దేశాన్ని బలహీనపరిచే పౌరసత్వసవరణ చట్టం (సీఏఏ) అమలుపరిచే బీజేపీ పన్నాగాన్ని అడ్డుకోవాలని వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో వామపక్ష, కాంగ్రెస్, ప్రజాతంత్ర శక్తుల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా సీపీఎం,కాంగ్రెస్, సీపీఐ నాయకులు ఆర్.వేణు, మోహనరావు, మన్మథరావు మాట్లాడుతూ దేశఐక్యతకు, లౌకిక, ప్రజాస్వామ్యానికి ముప్పు తెచ్చే విధంగా బీజేపీతెచ్చిన చట్టం ఉందన్నారు. సీఏఏ చట్టం దేశంలోని ముస్లిముల సమస్యకాదని,దేశాన్ని, రాజ్యాంగాన్ని బలహీనపరిచే విధంగా బీజేపీ దుష్టపన్నాగమని ఆరోపించారు. 2019లోనే పార్లమెంట్‌లో ఈ చట్టం తెస్తే వైసీపీతోపాటు అన్ని పార్టీలు బీజేపీ ముందు మోకరిల్లాయన్నారు. సీఏఏ అమలుకు వ్యతిరేకంగా ఈనెల 26వ తేదిన సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

రక్తహీనత నివారణపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: రక్తహీనత నివారణపై దృష్టి సారించాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. గురువారం స్థానిక మండలాభివృద్ధి అధికారి కార్యాలయంలో గ్రామైక్య సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలువల లోపంతో శిశు మరణాలు పెరుగుతు న్నాయన్నారు. గర్భిణులు, బాలింతలకు సంబంధించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. శిశు మరణాల శాతం నిరోధానికి కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీల నుంచి పూర్తిస్థాయిలో పోషక సామగ్రి అందేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కేకే సాగర్‌వర్మ, డాక్టర్ కె.కార్తీక్, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాలు అమలు చేయండి: ఎంపీడీవో

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాలను విధిగా అమలుచేయాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో సచివా లయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు, సిబ్బంది పార్టీలకతీతంగా వ్యవహరించాలన్నారు. విధులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల పరిధిలో అనుమతులు లేని ఫ్లెక్సీలు, తదితర సామగ్రిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లోని వారు వ్యవహరిస్తే సమాచారాన్ని అందించాలన్నారు. మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు మాట్లాడుతూ ఇంటి పన్నులు శతశాతం వసులు చేయాలని సూచించారు. పంచాయతీల్లో వెనుకబడి ఉన్నవారు ఈ నెలాఖరులోగా లక్ష్యాలను చేరుకోవాలన్నారు.పంచాయతీలకు సంబంధించి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఉన్నతాధికారులు ఆదేశించిన మేరకు సర్వేలు నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. కార్యదర్శులు ఎన్నికల కోడ్‌పై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

శాంతిభద్రతలు పాటించాలి: ఎస్ఐ



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాద్

భామిని: ఎన్నికల నిబంధనలు మేరకు ప్రతిఒక్కరూ శాంతిభద్రతలు పాటించాలని బత్తిలి ఎస్ఐ సీహెచ్.ప్రసాద్ ప్రజలకు సూచించారు. గురువారం గురండి, వడ్డంగి, లోహరజోలలో ప్రజలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎన్నికల్లో తగా దాలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని కోరారు.

కురుపాంలో ఓరల్ హెల్త్ డే ర్యాలీ



కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం: కురుపాంలో ప్రపంచ ఓరల్ హెల్త్ డే పురస్కరించుకుని గురువారం సీహెచ్‌సీ డెంటల్ అసిస్టెంట్ సర్జిన్ డాక్టర్ ఆర్.సుకృత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జిన్ డాక్టర్ శోభరాణి, డాక్టర్ సునీల్,డాక్టర్ ఆశ కృష్ణ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో కలెక్టర్ తదితర అధికారులు

రాయగడ:త్వరలోజరగనున్న ఎన్నికలనేపథ్యంలో పోలీసులు, ఎన్నికల అధికారుల సమన్వయంతో పనిచేయాలని పలువురు ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశహాలులో సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిపేందుకు కలెక్టర్ మనోజ్‌సత్యవాన్‌మహాజన్ అధ్యక్షతన పోలీసులు, ఎన్నికల అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎస్పీహరీష్ బీసీ,అదనపు కలెక్టర్లు భాస్కర్‌చంద్ర రౌయిత్, త్రినాథ్ మాఝి, సబ్‌కలెక్టర్లు కల్యాణి సంఘమిత్రదేవి,కిరణదీప్ కౌర్, వైద్యాధికారి విష్ణు ప్రసాద్ పంకజ్ పాల్గొన్నారు.

వైమానిక దళ అధికారి మృతి

రాయగడ:రాయగడ జిల్లా బిసంకటక్ సమితికి చెందిన వైమానికదళ అధికారి సీహెచ్‌కనకరాజు గుజరాత్‌లోని గాంధీధామ్‌లో చికిత్సపొందుతూ మృతిచెందాడు. సంబంధించి,అధికారులు బాధిత కుటుంబసభ్యులు కథనం మేరకు.. వైమానికదళం సాంకేతికవిభాగంలో కనకరాజు పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధుల్లో ఉన్న ఆయన ఇంటికి వెళ్లేందుకు బయటకు రాగానే హఠాత్తుగా ఛాతీలో నొప్పిరావడంతో కుప్పకూలిపోయాడు వెంటనే సహోద్యోగులు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ రాజు మృతిచెందాడు.రాజు మృతదేహాన్ని గుజరాత్ నుంచి బిసంకటక్ తీసుకురానున్నారు.

మానవజాతికి అడవులే జీవనాధారం: కలెక్టర్

రాయగడ: అడవులే మానవ జాతి జీవనాధారమని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ తెలిపారు. రాయగడలో ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకుని ఫారెస్ట్ ఎన్విరాన్‌మెంట్ క్లైమేట్ ఛేంజ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోఆయన మాట్లాడారు. అనంతరం అడవుల రక్షణ మానవును బాధ్యత అన్న అంశంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ హరీష్ బీసీ పాల్గొన్నారు.



సీతానగరం: దివ్యాంగుడితో మాట్లాడుతున్న విజయచంద్ర



పాచిపెంట: మూటకూరులో మాట్లాడుతున్న సంధ్యారాణి



కురుపాం రూరల్: సంగెడ్డలో బాబు ష్యూరిటీ కరపత్రం అందజేస్తున్న జగదీశ్వరి

వైసీపీ పాలనకు చరమగీతం పలకాలి

● తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు

● బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

వైసీపీ పాలనకు చరమగీతం పలకాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

పాచిపెంట: ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎవరికి భయపడవలసిన అవసరంలేదని, స్వేచ్ఛగా మద్దతు తెలియజేయాలని సాలూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని మూటకూడు, సతాభి, గిరిసిగుడ్డి, చిట్టెలబ గిరిశిఖర పంచాయతీల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మిమ్మల్ని బెదిరించి భయపెట్టిన వారు ఇక ఏమీచేయలేరన్నారు. కాగామండలంలోని మూలకూడు, సతాభి, గరిసిగుడ్డి, చిట్టెలబ పంచాయతీలకు సంబంధించి వంద గిరిజన కుటుంబాలు టీడీపీలో చేరాయి.టీడీపీ మండలాధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో సంధ్యారాణి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముఖి సూర్యనారాయణ, గూడేపు యుగంధర్, కొత్తల పోలినాయుడు, పి.ఉమామహేశ్వరరావు, మోహనరావు పాల్గొన్నారు.

సీతానగరం: పార్టీ నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి విజయచంద్ర పిలుపునిచ్చారు. సీతానగరంలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీతానగరంలో ఓ నాయకుని ఇంట్లో పార్టీ నాయకులతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మార్గమధ్యలో కనిపించిన ఓ దివ్యాంగుడితో విజయచంద్ర మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో పెదబోగిల వైస్ ప్రెసి డెంట్ కె.అరవింద్,నీటి సంఘం మాజీ చైర్మన్ తెంటు వెంకట అప్పలనాయుడు, సింహాలు, జి.అప్పారావుపాల్గొన్నారు. అలాగే బలిజిపేట మండలంలో గలావల్లిలో పార్వతీపురం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని కార్యకర్తలకు సూచించారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు పెంకి వేణుగోపాల్‌నాయుడు, మామిడి సాయి పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్టలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగ్యారెంటీలపై ఇంటింటికి వెళ్లి సర్పంచ్, అరకు పార్లమెంట్ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు అంబటి తవిటినాయుడు అవగాహన కల్పించారు.



గరుగుబిల్లి: పిట్టలమెట్టలో కరపత్రాలు పంపిణీచేస్తున్న నాయకులు

కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు యామల శ్రీనివాసరావు, మంత్రబుడ్డి జగ్గునాయుడు, కొట్నాల గోపాలరావు పాల్గొన్నారు.

కురుపాం రూరల్: గుమ్మిడిగూడ పంచాయతీ పరిధిలోగల సంగెడ్డ, శింగుపురం, గుజ్జిపాడుల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయిక జగదీశ్వరి గురువారం ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కలిశెట్టి కొండయ్య డాక్టర్ శెట్టి చంద్రరావు, గంగులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై నిరసన



నవదుర్గా ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

పార్వతీపురంటౌన్:అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారని ఆరోపిస్తూ గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈమేరకు పట్టణంలోని కొత్తవలస నవదుర్గాఆలయం వద్ద ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వార్డువలంటీర్లు, గృహసారధులతో సమావేశం ఏర్పాటుచేశారన్న సమాచారం తెలుసుకున్న ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, టీడీపీ నాయకులు మజ్జి కృష్ణమోహన్, మజ్జి వెంకటేష్, పాలకొండ రాజశేఖర్ తదితరులు అక్కడకు చేరుకున్నారు.టీడీపీనాయకులు వస్తున్నారన్న సమాచారాన్ని అందుకున్న వార్డు వలంటీర్లు,గృహసారధులు ఆలయం వద్ద నుంచి జారుకున్నారు. దీంతో కౌన్సిలర్‌తోపాటు టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘి స్తున్నారని నిరసన తెలిపారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను స్థానిక ఎమ్మెల్యే జోగారావుతో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉల్లఘించి పార్టీకి సంబంధించి ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎన్నికలకు సంబంధించి పట్టణంలో 144సెక్షన్‌ఉండగా, ఇలాఅధికార పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం ఈసీ ఆదేశాలు, నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. అధికార పార్టీ ప్రచారానికి సంబంధించి కలెక్టర్, ఎన్నికల అధికారి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

సీళ్లు లేని తూనిక యంత్రాల గుర్తింపు

పాలకొండ: తూనిక యంత్రాలకు సీళ్ల లేకపోతే చర్యలు తప్పవని శ్రీకాకుళం తూనికల కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ విశ్వేశ్వరరావు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీల్ లేని పది తూనిక యంత్రాలను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో శ్రీకాకుళం ఇన్‌స్పెక్టర్ రాజారమేష్, పార్వతీపురం ఇన్‌స్పెక్టర్ రత్నరాజు, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహమూర్తి ఉన్నారు.



సరుకులను పరిశీలిస్తున్న తూనికలు, కొలతలశాఖల అధికారులు

శిశు మరణాలను తగ్గించాలి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: పీఆర్ఐఎస్ఎం కార్యక్రమం ద్వారా శిశు మరణాల సంఖ్యను తగ్గించాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు.గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో జి.సత్య నారాయణ, డాక్టర్ పాలవలస ఉమామహేశ్వరి, డాక్టర్ మానస, వివిధశాఖల సిబ్బందితో సమీక్షిం చారు.రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలు తక్కు వ బరువు ఉన్న పిల్లలను గుర్తించి వారిని చివాలయ సిబ్బంది, స్వయంసహాక సంఘాలు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు దత్తత తీసుకోవాలన్నారు. దత్తత తీసుకున్న వారిని ప్రతినెలా మూడుసార్లు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జి.సత్య నారాయణ, డాక్టర్ పాలవలస ఉమామహేశ్వరి, డాక్టర్ మానస, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ల నియామకం

గరుగుబిల్లి: మన్యం జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మండలాలకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ నియమిస్తూ గురువారం ఆదేశాలు జారీచేశారు. పాలకొండ నియోజకవర్గం పరిధిలోని పాలకొండకు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, పోలీస్ సిబ్బంది జె.గణప్రసాద్‌ను, సీతంపేటకు సంబంధించి ఎంపీడీవో కె.గీతాంజలి, కానిస్టేబుల్ డి.మాణిక్యరావును, భామినికి ఎంపీడీవో కె.కిషోర్‌కు మార్, పీసీ పి.బాబురావును, వీరఘట్టానికి ఎంపీడీవో ఎంవీ బాలసుబ్రహ్మణ్యం, పీసీ కె.గణేష్‌ను నియమించారు. కురుపాం నియోజకవర్గంలోని కురుపాం ఎంపీడీవో ఎస్.అప్పారావు, పీసీ బి.అశోక్‌ను, జియ్యమ్మవలస మండలానికి ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, పీసీ కె.అశోక్‌కుమార్‌ను, గుమ్మలక్ష్మీపురం మండలానికి ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్, పీసీ ఎన్.బాలకృష్ణలను, కొమరాడ మండలానికి ఎంపీడీవో ఎం.మల్లికార్జునరావు, పీసీ జి.వైకుంఠంను, గరుగుబిల్లి మండలానికి ఎంపీడీవో పి.సూర్య నారాయణ, పీసీ కె.ఉమామహేశ్వరరావులను నియమించారు.పార్వతీపురంనియోజకవర్గంలోని పార్వతీ పురం మండలానికి ఎంపీడీవో షేక్‌మహమ్మద్ అఖీద్ జావెద్, పీసీ బి.సన్యాసిరావును,సీతానగరంమండలానికి ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, పీసీ బి.కుమార్‌ను, బలిజిపేట మండలానికి ఎంపీడీవో రమేష్‌నాయుడు, పీసీ ఎం.మహేష్‌ను నియమించారు. సాలూరు నియోజకవర్గంలోని మక్కువ మండలానికి ఎంపీడీవో పి.దేవకుమార్, పీసీ పి.పాపారావును, పాచిపెంట మండలానికి ఎంపీడీవో లక్ష్మీకాంత్, పీసీ ఎం.అప్పన్నను నియమించారు.అలాగే ఆయామండలాల పరిధిలో వీడియో గ్రాఫర్లకు సంబంధించి తహసీల్దార్లు నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల పరిధిలో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలను వివరిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. సీసీ టీవీ, కెమెరాలు, వెబ్ కెమెరా, తదితర సామగ్రిని అమర్చాల్సిఉందని తెలిపారు. ఫిర్యాదులతోపాటు సమస్యలు వివరించేందుకు టోల్‌ఫ్రీ నెంబరు 1950ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కాగాఎన్నికల నిర్వహణకు సంబంధించి మండల పరిధిలో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై ఆదేశాలు జిల్లా ఎన్నికల అధికారి నుంచి అందాయని గరుగుబిల్లి ఎంపీడీవో పి.సూర్యనారాయణ తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పీవో, ఏపీవోలు..

సాలూరు రూరల్:ఎన్నికలు సజావుగా నిర్వహణకు జిల్లా అధికారులు కార్యాచరణ చేశారు.పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించారు.జిల్లాలో పోలింగ్ ఆఫీసర్లుగా(పీవో) 1240 మందిని ఉపాధ్యాయులను, 1199 అసిస్టెంట్ పోలింగ్‌ఆఫీసర్లను(ఏపీవో) నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీచేశారు.సార్వత్రిక ఎన్నికలను ఉపాధ్యాయులతోనే నిర్వహించనున్నారు. జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు ఏపీ, ఒడిశాలో వివాదస్పద గ్రామాల ఓటర్ల కోసం మూడు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు కొఠియా గ్రూప్ గ్రామాల్లోనే ఏర్పాటు చేస్తున్నారు. సాలూరు మండలంలో 102 మంది పీవోలు, 93 మంది ఏపీవోలు, పాచిపెంట మండలంలో 63 పీవోలు, ఏపీవోలు 66 మంది, మక్కువ మండలంలో 65 మంది పీవోలు, 66 మంది ఏపీవోలు, భామినిలో 31 మంది పీవోలు,29 మంది ఏపీవోలు, గుమ్మలక్ష్మీపురంలో 59 మంది పీవోలు, 102 మంది ఏపీవోలు, జియ్యమ్మవలసలో 61 మంది పీవోలు, 42 మంది ఏపీవోలు, కురుపాంలో 74 మంది పీవోలు, 64 మంది ఏపీవోలు, పాలకొండలో 89 మంది పీవోలు, 65 మంది ఏపీవోలు, సీతంపేటలో 95 మంది పీవోలు, 70 మంది ఏపీవోలు, వీరఘట్టంలో 86 మంది పీవోలు, 50 మంది ఏపీవోలు, బలిజిపేటలో 67 మంది పీవోలు, 64 మంది ఏపీవోలు గరుగుబిల్లిలో 79 మంది పీవోలు, 65 మంది ఏపీవోలు కొమరాడలో 58 మంది పీవోలు, 89 మంది ఏపీవోలు, పార్వతీపురంలో 153 మంది పీవోలు, 172 మంది ఏపీవోలు, సీతానగరంలో 80మంది పీవోలు, 49 మంది ఏపీవోలు, సాలూరు అర్బన్‌లో 20 మంది పీవోలు, 34 మంది ఏపీవోలు, పార్వతీపురం అర్బన్ నుంచి 44 మంది పీవోలు, 61 మంది ఏపీవోలు, పాలకొండ అర్బన్ నుంచి 14 మంది పీవోలు, 18 మంది ఏపీవోలను జిల్లాఅధికారులు నియమించారు. వీరందరికి మండల కేంద్రాల్లో తొలి విడతగా శిక్షణ ఇవ్వనున్నారు. మండలకేంద్రాల్లో పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వడానికి అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనీను నియమించారు. ఈ మేరకు పార్వతీపురంలో గురువారం డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో సాలూరు, కురుపాం, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల దాదాపు 30 మంది ఏఎల్ఎంటీలకు శిక్షణ నిర్వహించారు. ఏఎల్ఎంటీలు ఒకటిరెండు రోజుల్లో మండలస్థాయిలో పీవో, ఏపీవోలకు శిక్షణ నిర్వహించనున్నారు. పాచిపెంట మండలంలో శనివారం పీవో,ఏపీవోలకు శిక్షణ జరగనుంది.

అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తి గుర్తింపు

● పోలీసులకు అప్పగించిన మార్కొండపుట్టి గ్రామస్థులు

కొమరాడ : మండలంలో మార్కొండపుట్టిలో బుధవారం అర్థరాత్రి ఓ వ్యక్తి గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో గ్రామస్థులు, యువకులు గుర్తించారు. ఆయన్ను పట్టుకొని నిలదీశారు. పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కొమరాడ పోలీసులకు గ్రామస్థులు ఆ వ్యక్తిని అప్పగించారు. కాగా సంబంధిత వ్యక్తి మతిస్థిమితం లేని వాడిగా గుర్తించి పంపించినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు.



మతి స్థితిమితం లేని వ్యక్తి

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉన్నా మందిమార్బలంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ప్రచారం చేశారని టీడీపీ నాయకులు ఫిర్యాదుచేశారు. కొత్తవలస ఆరో వార్డు రాజీవ్ కొత్తపోలమ్మ కాలనీలో ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే నాయకులు, కౌన్సిలర్లతో ఇంటింటికి వెళ్లి ప్రచారంచేశారని టీడీపీనాయకులు ఆరోపించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై టీడీపీకి చెందిన ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కె.నారాయణరావు, ఆ పార్టీ నాయకులు ఎం.వెంకటేష్, ఎం.కృష్ణమోహన్, పి.రాజశేఖర్‌లు ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు,పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా 144 సెక్షన్ అమలులో ఉండగా, ఏ పార్టీ వారైనా నాయకులు, కార్యకర్తలతో ప్రచారం చేయడానికి వీలు లేదని ఎన్నికలనోడల్ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారని, వారు సమగ్ర దర్యాప్తు చేసి ఆర్వోకు తుది నివేదికను అందజేస్తారని చెప్పారు.

●**సీతానగరం**:మిర్తివలస, తుమరాడల్లో ఎమ్మెల్యే జోగారావు సమావేశం ఏర్పాటుచేయడానికి సిద్ధంకాగా ఎంసీసీ నోడల్ అధికారి రమేష్ సమాచారం తెలియగానే అక్కడకు చేరుకుని నిర్వాహకులతో మాట్లాడారు, బహిరంగసభకుఅనుమతి లేనందున నిర్వహించరాదని తెలిపారు. దీంతో గ్రామ నాయకులు ఇంట్లో కార్యకర్తలతో మాట్లాడి వెనుదిరిగారు. ఈవిషయంపై ఉన్నతాధికారులు తెలియజేస్తామని ఎంపీడీవో తెలిపారు.

నేడు రావుపల్లిలో వైద్య శిబిరం

గరుగుబిల్లి:మండలంలోని రావుపల్లిలో సీతారామ మందిర పునఃప్రతిష్ఠ పురస్కరించుకుని శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.పార్వతీపురానికి చెందిన డాక్టర్ డి.రామ్ మోహనరావు, హైదరాబాద్ కేర్ ఆసుపత్రికి చెందిన సీనియర్ గుండె వైద్య నిపుణుడు గుల్ల సూర్యప్రకాష్‌తో పాటు మరో 21 మంది వైద్యులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. వైద్యశిబిరానికి హాజరయ్యేవారు గతంలో వైద్యులు తనిఖీలు చేసిన వివరాలతో రావాలని కోరారు.

ఎం.రాజపురంలో పోలీసుల కవాతు

వీరఘట్టం: ఎం.రాజపురం, వీరఘట్నంలో గురు వారం ఎస్ఐ ఎస్‌కే ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు.అనవసరమైన తగాదాలకు వెళ్లవద్దన్నారు.

గ్రంథాలయాల సెస్ జమచేయాలి

గరుగుబిల్లి: పంచాయతీ కార్యదర్శులు గ్రంథాలయాలకు సంబంధించి సెస్‌జమ చేయాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్ వివరాలను మండలగ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు సమాచారాన్ని అందించామని మధుసూదనరావు తెలిపారు. గ్రంథాలయానికి 8 శాతం సెస్ విధిగా అందించాలని ఎంపీడీవో ఆదేశించారు. కొన్నాళ్లుగా చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని మధుసూదనరావు వివరించారు.

ధాన్యం బకాయిలను విడుదల చేయాలి

● రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు

జియ్యమ్మవలస: ప్రభుత్వంరైతులకు రూ. 48.25 కోట్లు ధాన్యం బకాయిలను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు.గురువారం జియ్యమ్మవలసలో విలేకరులతో మాట్లాడుతూ రెండు నెలలు గడుస్తున్నా రైతులకు ధాన్యం బకాయిలను చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. రైతులకు బకాయిలు చెల్లించకపోతే ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారుల అనుమతి తీసుకుని సోమవారం నుంచి నిరసనలు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా రూ. 900 కోట్లు వరకు ధాన్యం బకాయిలు ఉన్నాయని, మన్యం జిల్లాకు సంబంధించి 4 వేల మంది రైతులకు రూ. 48.25 కోట్లు చెల్లించవలసి ఉందని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పోల సింహాచలం, బడే శ్రీనివాసరావు, జోగినాయుడు, దత్తి మౌలేశ్వరరావు, జి.కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలనాయుడు